క్లుప్తంగా

ట్రాఫిక్ రద్దీపై డ్రోన్‌తో నిఘా



డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న సీఐ మన్సూరుద్దీన్, సిబ్బంది

కర్నూలు: నగరంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు డ్రోన్ కెమెరా సేవలు వినియోగిస్తున్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆదివారం సాయంత్రం డ్రోన్‌లతో నిఘా పటిష్టం చేశారు. ప్రధాన సర్కిళ్లు, రద్దీ ఉన్న ప్రాంతాల్లో డ్రోన్‌ను వినియోగించి నిఘా ఏర్పాటు చేశారు. ఓవర్ స్పీడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్‌లను గుర్తించారు. అలాగే నిబంధనలను పాటించని వారికి ఆన్‌లైన్‌లోనే జరిమానాలను విధించారు. ప్రధాన రహదారులతో పాటు వివిధ కాలనీలు, కూడళ్లలో వాహనాల రాకపోకలపై డ్రోన్ నిఘాతో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ జామ్ కాకుండా కొన్ని ప్రాంతాల్లో డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలించి అక్కడికి ట్రాఫిక్ సిబ్బందిని పంపి ముందస్తు చర్యలు చేపట్టారు. నగరంలో ఇకపై ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు, ఇరుకు రోడ్లలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో పరిశీలించి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ డ్రోన్ కెమెరాల సహాయంతో నిఘాను ఏర్పాటు చేయనున్నట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు: నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ అధికారులు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఆదివారం ఆయా స్టేషన్ల అధికారులు వారి పరిధిలోని రౌడీ షీటర్లను, నేర చరిత్ర కలిగిన వారిని, చెడు నడత కలిగిన వ్యక్తులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. నేర వృత్తికి స్వస్తి పలికి సత్ప్రవర్తనతో జీవించాలని హిత బోధ చేశారు. గొడవలు, ఘర్షణలకు దిగి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హమాలీ ఆత్మహత్య

కర్నూలు: కలెక్టరేట్‌లోని పౌర సరఫరాల శాఖ గోదాములో హమాలీగా పనిచేసే రవికుమార్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. శనివారం రాత్రి ఫుల్‌గా మద్యం తాగి ఇంటికి చేరుకున్నాడు. భోజనం అనంతరం గదిలోకి వెళ్లి తలుపు వేసుకొని ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కొద్ది సేపు తర్వాత కుటుంబ సభ్యులు తలుపులు తట్టగా పలకకపోవడంతో బలవంతంగా వాటిని తొలగించి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. ఉరి నుంచి తప్పించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రవికుమార్ సంజయ్‌గాంధీ నగర్‌లో నివాసం ఉంటాడు. భార్య సునీతతో పాటు ఇద్దరు కూమారులు, కూతురు సంతానం. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం

కర్నూలు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (టౌన్) ఆవరణలో ఈ నెల 14వ తేదీన ఉదయం 11 గంటలకు నూతనంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరుగుతుందని ఏపీ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు, కళాశాల ప్రిన్సిపాల్ సి. సుంకన్న తెలిపారు. ఆదివారం రాత్రి వారు విగ్రహం ఏర్పాటు చేసిన ప్రాంతంలో మాట్లాడుతూ రూ.4 లక్షల వ్యయంతో విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజు ఆవిష్కరిస్తారని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి జిల్లాలోని ప్రజలు, ఎన్జీఓ నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ ప్రజా, దళిత సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీఎం వెంకటేశ్వర్లు, ఎన్‌సీహెచ్ బజారన్న, కోశాధికారి ఆర్ సంజీవకుమార్, నాయకంటి సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం..!

గడివేముల: పరిమితికి మించి ఆటోలలో ప్రయాణికులు, కూలీలు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఆదివారం గడివేముల-నందికొట్కూరు రహదారిలో ఆటోలో పరిమితికి మించి టాపుపై కూడా ప్రయాణించడం కనిపించింది. ఇటీవల వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా ప్రజల్లో మార్పు రావడంలేదు. ఎన్నిసార్లు పోలీసులు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ఫలితం లేకుండా పోతోంది. ఆటో డ్రైవర్లు సైతం ఆదాయం చూసుకుంటున్నారే తప్ప ప్రజల ప్రాణాలను పట్టించుకోవడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆటోలో పరిమితికి మించి ప్రమాదకరంగా వెళ్తున్న దృశ్యం

అడుగుకో గుంత!



గడివేముల - నంద్యాలలో రహదారిలోని బూజునూరు గ్రామం వద్ద గుంతలమయంగా రోడ్డు

గడివేముల: ఆ రోడ్డుపై వెళ్లాలంటే నరకయాతన. నడుం నొప్పులు తప్పకుండా వస్తాయ్. అడుగుకో గుంత ఉండటంతో అవస్థలు పడాల్సిందే. మండల కేంద్రమైన గడివేముల నుంచి నంద్యాలకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. రోడ్డుపై అధిక లోడుతో వెళ్తున్న భారీ వాహనాల వలన రోడ్లు దెబ్బతిన్నాయి. రహదారి అంతా చిన్నాభిన్నం కావడంతో అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. ప్రతి నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారిలో వెళ్తుంటాయి. ఈ క్రమంలో గతంలో గ్రామస్తులు కిందపడి గాయాల పాలైన సంఘటనలు అనేకం. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు లేక నూతనంగా నిర్మించాలని ఆయా గ్రామల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు మధ్యలో స్తంభం!



ఓర్వకల్లు : మండల కేంద్రమైన ఓర్వకల్లులోని బైరెడ్డి కాలనీ అంతర్గత రహదారిలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం దర్శనమిస్తోంది. కాలనీలో రోడ్డు కంటే ముందుగానే విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. అయితే స్తంభాన్ని తొలగించాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా స్పందన లేదు. ఇంతలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. అందులో భాగంగా స్థానిక బైరెడ్డి కాలనీలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించేందుకు ఎం.రాంభూపాల్‌రెడ్డి కాంట్రాక్టు దక్కించుకున్నాడు. రోడ్డు నిర్మాణ పనులను మొదలు పెట్టేంకుందు స్తంభాన్ని తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులను కోరినట్లు సమాచారం. అయితే సంబంధిత అధికారులు స్పందించకపోవడం, సదరు కాంట్రాక్టర్‌పై ఒత్తిళ్లు పెరడంతో స్తంభాన్ని అలాగే ఉంచి సీసీ రోడ్డు పనులు పూర్తి చేసినట్లు తెలిసింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు మధ్యలో వున్న స్తంభాన్ని తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

శనగ రైతుల గగ్గోలు

- నిరాశపరిచిన మద్దతు ధర
- అమ్మబోతే అడవి...కొనబోతే కొరివి
- ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.5650
- బయట మార్కెట్‌లో రూ.5800
- గిట్టుబాటు కాదంటున్న అన్నదాతలు



ప్రైవేట్ గోదాముల్లో నిల్వవున్న శనగ బస్తాలు

కోడుమూరు రూరల్: కోడుమూరుకు చెందిన రైతు మహేశ్వరరెడ్డి తనకున్న 4ఎకరాల పొలంతో పాటు, మరో 10ఎకరాల పొలాన్ని ఎకరా రూ.10వేలకు కౌలుకు తీసుకుని రబీ సీజన్‌లో శనగ పంటను సాగు చేశాడు. ఎకరాకు రూ.15వేల నుంచి రూ.18వేల వరకు పెట్టుబడులు పెట్టాడు. అయితే సకాలంలో వర్షాలు పడకపోవడం, కురిసినా పూత సమయంలో కురవడంతో పూతరాలిపోయి దిగుబడి భారీగా తగ్గిపోయింది. అలాగే శనగ దిగుబడి వచ్చే సమయానికి శనగ ధర భారీగా పడిపోవడంతో పంటనంతా ఇంటిలోనే నిల్వ ఉంచుకుని ధర కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం క్వింటా శనగలకు మద్దతు ధరగా రూ.5650 ప్రకటించింది. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే మార్కెట్లో శనగలు క్వింటాపై రూ.100 నుంచి రూ.150 ఎక్కువగా పలుకుతోంది. దీంతో రైతు మహేశ్వరరెడ్డి తక్కువ ధరకు శనగలను అమ్ముకోలేక ఇంటిలోనే నిల్వ ఉంచుకుని గిట్టుబాటు ధర కోసం ఎదురు చూస్తున్నారు. ఈ పరిస్థితి ఒక్క మహేశ్వరరెడ్డిదే కాదు రబీ సీజన్‌లో శనగ పంట సాగు చేసిన ప్రతి రైతుది.

దిగుబడులన్నీ ఇండ్లు, గోదాముల్లోనే నిల్వ

ఈ ఏడాది రబీ సీజన్‌లో కర్నూలు జిల్లాలో 44,703కు పైగా హెక్టార్లలో రైతులు శనగ పంటను సాగు చేశారు. వర్షాభావ పరిస్థితులు, అకాల వర్షాల వల్ల శనగ దిగుబడులు భారీగా తగ్గిపోయాయి. ఎకరాకు 2 క్వింటాల నుంచి 3 క్వింటాళ్లకు మించి శనగ దిగుబడులు రాలేదు. పండిన పంటను అమ్ముకుందామంటే మార్కెట్లో శనగలకు ధర లేకపోవడంతో ఉన్న దిగుబడులను రైతులు ఇండ్లు, గోదాముల్లో నిల్వ ఉంచుకుని గిట్టుబాటు ధర కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం శనగలు క్వింటాకు రూ.5650 మద్దతు ధర ప్రకటించింది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా శనగలు రూ.5700 నుంచి రూ.5800 పలుకుతోంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే మార్కెట్‌లో క్వింటా రూ.150 ఎక్కువగా ఉండడంపై రైతులు ఇదెక్కడి మద్దతు ధర అంటూ నివ్వెరపోతున్నారు. క్వింటా శనగలకు కనీసం రూ.7వేల మద్దతు ధర కల్పిస్తేగాని పంట సాగుకు పెట్టిన పెట్టుబడులు రావంటూ వాపోతున్నారు.

భారీ వ్యత్యాసం

రబీ సీజన్‌కు ముందు ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై ఏకంగా క్వింటా శనగలు రూ.7050 ప్రకటించి రైతులకు అంటగట్టింది. భారీగా ధరను పెంచి శనగలను రైతులకు అంటగట్టిన కూటమి ప్రభుత్వం నేడు అదే రైతుల నుంచి శనగల కొనుగోలు చేసేందుకు మద్దతు ధర క్వింటా రూ.5650 ప్రకటించడం దారుణంగా ఉందంటూ రైతులు వాపోతున్నారు. తమకేమో క్వింటా రూ.7050 ప్రకారం అమ్మిన ప్రభుత్వం నేడు అదే శనగలకు మద్దతు ధర పేరుతో కేవలం రూ.5650 ప్రకటించడంపై రైతులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. అమ్మబోతే అడవి..కొనబోతే కొరివి అన్న చందంగా తమ పరిస్థితి మార్చిందని వాపోతున్నారు. పైగా శనగలు విక్రయించాలంటే సవాలక్ష ఆంక్షలు విధించడంపై మండిపడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి శనగ పంటకు రూ.7వేల మద్దతు ధర ప్రకటించి కొనుగోళ్లు చేస్తే బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మద్దతు ధర రూ.7వేలు ప్రకటించాలి



ఆరు ఎకరాల్లో రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టి శనగ పంట సాగు చేస్తే వానల్లేక ఎకరాకు రూ.3 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. పండిన పంటనైనా అమ్ముకుందామంటే మార్కెట్లో రేటు లేని పరిస్థితి. ప్రభుత్వం నిర్ణయించిన ధర, మార్కెట్లో శనగల ధర ఒకటే విధంగా ఉంది. ప్రభుత్వ ఆలోచించి క్వింటా శనగకు రూ.7వేలు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేస్తే బాగుంటుంది. –నవీన్‌కుమార్‌రెడ్డి, కోడుమూరు

ధర గిట్టుబాటు కావడం లేదు



పదెకరాల సొంత పొలంతో పాటు, మరో 15ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని రబీలో శనగ పంట సాగు చేస్తే వర్షాభావ పరిస్థితుల వల్ల దిగుబడి భారీగా తగ్గిపోయింది. పండిన పంటకు మార్కెట్లో ధర లేక ఇండ్లు, గోదాముల్లో నిల్వచేసుకుని ధర కోసం ఎదురు చూస్తున్నా. ప్రభుత్వం శనగలకు ప్రకటించిన మద్దతు ధర, మార్కెట్లో ధర ఒకటే విధంగా ఉంది. ఈ లెక్కన అమ్మితే పెట్టుబడి కూడా రాదు. ప్రభుత్వం పునారాలోచించాలి.

–లక్ష్మన్న, కోడుమూరు.

రేపు తెలుగు నాటక రంగ దినోత్సవం

కర్నూలు(సెంట్రల్): కవి, సంఘ సంస్కర్త, మొదటి తెలుగు నాటక రచయిత కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకొని మంగళవారం టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు నాటక రంగ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నాటక రంగానికి చెందిన హార్మోనిస్టులు పీజీ వెంకటేశ్వర్లు, జేయం రాజశేఖరరాజు, లక్ష్మన్న, కేశవులు, ఎస్.ధనుంజయ్య, పి.రామలింగం, ఎస్.రామకృష్ణారెడ్డి, జయ మహేశ్వరయ్య, బందేగౌడ, బలరాంనాయుడు, చల్ల నరసింహనాయుడు, కేబీ నాగప్పకు కందుకూరి పురస్కారాలతో సత్కరించనున్నట్లు చెప్పారు. అనంతరం నవీన్‌కుమార్ నాయుడు బృందం హరిశ్చంద్ర నాటకం, కేవీ రమణ బృందం శ్రీకృష్ణ రాయభారంలోని సన్నివేశాలను ప్రదర్శిస్తారని చెప్పారు. కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు చెప్పారు.

విద్యార్థుల జీవితాలతో సర్కారు చెలగాటం

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు చెల్లించకుండా వారి జీవితాలతో కూటమి సర్కారు చెలగాటమాడుతోందని బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులకు సంబంధించిన అన్ని రకాల ఫీజులను చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు సంబంధించి 3,900 కోట్ల ఫీజులను బకాయిపెట్టిందన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం





గడివేములలో ఈత మట్టలతో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు, కల్లూరులో ర్యాలీ చేస్తున్న చిన్నారులు

గడివేముల: మండల వ్యాప్తంగా క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా జరుపుకున్నారు. క్రైస్తవులు మట్టలు చేత పట్టుకుని ర్యాలీలు నిర్వహించారు. మానవహారాలుగా ఏర్పాటై క్రీస్తు సందేశం వినిపించారు. మండలంలోని పలు క్రైస్తవ ప్రార్థన మందిరాలలో ప్రార్థనలు చేపట్టారు. మండల కేంద్రమైన గడివేముల ఏబీఎం చర్చి పాస్టర్ ఆధ్వర్యంలో చర్చి వద్దకు అధిక సంఖ్యలో చేరుకున్న క్రైస్తవులు భక్తిగీతాలతో సందడి చేశారు.

కల్లూరు : క్రీస్తు మార్గం అనుసరణీయమని పాస్టర్లు అన్నారు. మట్టల ఆదివారం సందర్భంగా కల్లూరు గ్రామీణ, అర్బన్ చర్చిలలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు మట్టలను చేతపట్టుకుని విధులలో తిరిగారు.

లేబర్ కోడ్ల రద్దుకు పోరాటం



మాట్లాడుతున్న సీహెచ్ నరసింహరావు

కర్నూలు(సెంట్రల్): కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటాలు చేద్దామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింహరావు హెచ్చరించారు. ఆదివారం కర్నూలులో జరుగుతున్న సీఐటీయూ రాష్ట్ర స్థాయి ప్రాంతీయ సదస్సులో రెండో రోజు ఆయన మాట్లాడుతూ..బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వం కార్మికులకు నష్టదాయకమైన కార్మిక చట్టాలను తీసుకొచ్చిందన్నారు. 29 రకాల కార్మిక చట్టాలను మార్చుచేస్తూ నాలుగులేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. వీటితో కార్మికులు 8 గంటల పనిని కోల్పేయే అవకాశం ఉందన్నారు. అంతేకాక కార్మికులు సమ్మె చేసే హక్కును కాలరాసిందన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా మే 20వ తేదీన దేశ వ్యాప్తంగా ఆందోళన చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఓబులు, కర్నూలు, అనంతపురం, కడప,నంద్యాల, సత్యసాయి జిల్లాల కార్య దర్శులు ఎండీ అంజిబాబు, నాగేంద్ర, మనోహర్, నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

సెస్ నిధులను గ్రంథాలయాభివృద్ధికి వినియోగించాలి



గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక సదస్సులో మాట్లాడుతున్న వల్లూరు శివప్రసాదు

కర్నూలు(సెంట్రల్): సెస్ రూపంలో ప్రజల నుంచి వసూలు చేస్తున్న నిధులను గ్రంథాలయాలభివృద్ధికి వినియోగించాలని ఏపీ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కన్వీనర్ వల్లూరు శివప్రసాదు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో అరసం జిల్లా అధ్యక్షుడు కలంప్రహ్లాద అధ్యక్షతన గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ..స్వాతంత్రోద్యమ కాలంలో ప్రజల్లో కాంక్షను రగిలించడానికి, సామాజిక స్పృహను పెంచడానికి, మానవీయ విలువలను పెంపొందించడానికి అశాస్త్రీయ భావాలను తొలగించడంలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషించాయన్నారు. నేడు గ్రంథాలయాలు ఆదరణకు నోచుకోక నిర్వీర్య స్థితిలో ఉన్నాయన్నారు. గ్రామ,గ్రామాన గ్రంథాలయాలను పునరుద్ధరించాలని, ఖాళీగాఉన్న గ్రంథాలయ ఉద్యోగుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏప్రిల్ 27వ తేదీనవిజయవాడలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని, అధికసంఖ్యలో సాహితీ అభిమానులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న చంద్రశేకర్ కల్కూరా, జేఎస్ఆర్‌కే శర్మ మాట్లాడుతూ..గ్రంథాలయాల పునరుద్ధరణకు అన్ని భాషాసాహితీ సమాజిక సంస్థలు ఒకే తాటి పై నిలబడి పోరాడాలన్నారు. ఊరూరా విజ్ఞానాన్ని పంచుతూ కళకళలాడిన గ్రంథాలయాలు నేడు కనుమరుగు దశలో ఉండటం చాలా విచాకరమన్నారు. కాగా, ఇటీవల ఉగాదిపురస్కారాలు అందుకున్న డాక్టర్ ఎం.హరికిషన్, ఎస్‌డీవీ అజీజ్, దాసరి వెంకటరమణలను అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖ తరఫున ఘనంగా సన్మానించి పుస్తకాలు బహూకరించారు. కార్యక్రమంలో ఎం.హరకిషన్, మారుతి పౌరోహితం, ఎస్‌డీవీ అజీజ్, డీఎస్పీ మహబూబ్ బాషా, ఇనయతుల్లా, కొత్తపలి సత్యనారాయణ, ప్రమోద్‌చక్రవర్తి, ఆదవాని హనుమంతప్ప, బలశౌరి, చక్రపాణి యాదవ్, రాణిలీలావతి, చంద్రమౌళి పాల్గొన్నారు.

15 నుంచి సప్లిమెంటరీ పరీక్షల ఫీజు

కోడుమూరు రూరల్: ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులు ఈనెల 15వ తేదీ నుంచి 22 వరకు సంప్లిమెంటరీ పరీక్షల కోసం ఫీజు చెల్లించవచ్చని కోడుమూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు స్థానిక జూనియర్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

మొదలైన విద్యుత్ కోతలు

పాణ్యం : మండలంలో విద్యుత్ కోతలు మొదలయ్యాయి. మధ్యాహ్నం, రాత్రి సమయంలో విద్యుత్ కోతలతో వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక వైపు ఎండల తీవ్రత, ఉక్కపోత ఉండగా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రాత్రి వేళలో విద్యుత్ కోతలు కారణంగా మరింత ఇబ్బందులు పడుతున్నారు.

విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే

గడివేముల: మండలంలోని పరిధిలోని గ్రంధివేముల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో ఆదివారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పాల్గొన్నారు. స్వామికి వారికి ప్రత్యేక పూజలు, ఆకు పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

15న పాణ్యంలో ధర్నా

పాణ్యం : ఈనెల 15వ తేదీన పాణ్యం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎస్సార్బీసీ పరిరక్షణ సమితి సభ్యులు ఆదివారం తెలిపారు. ఎస్సార్బీసీకి తలమానికమైన గోరుకల్లు ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేయాలని, అవసరమైన నిధులు ప్రభుత్వం కేటాయించాలనే డిమాండ్‌తో ఎస్సార్బీసీ ఆయకట్టు రైతులు, రైతు సంఘ నాయకులు ఈ ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

21న అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు : మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో ఈ నెల 21న అంతర్రాష్ట్ర ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈస్టర్ పండుగ సందర్భంగా స్థానిక ఏబీఎం చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో పాలపళ్ల విభాగం ఎద్దుల పోటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు తొలి ఆరు స్థానాలకు వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.8 వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి గల ఎద్దుల యజమానులు అదే రోజు ఉదయం 8 గంటలలోపు రూ.600 లు ప్రవేశ రుసుం చెల్లించి యజమానుల పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 84648 15832, 96186 22351 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో భీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట



భీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న కురువ సంఘం నాయకులు

కల్లూరు : మండల పరిధిలోని పర్ల గ్రామంలో భీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ స్థాపన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కురువ కులస్తులు భీరప్ప డోళ్లలతో సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కర్నూలు జిల్లా కురువ సంఘం అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రంగస్వామి, ఉపాధ్యక్షులు ధనుంజయ, ఉమ్మడి జిల్లా గొర్రెల సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి కృషి చేసిన కమిటీ సభ్యులను, గ్రామ కులజులను అభినందించారు. కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు బీచుపల్లి, తిరుపాల్, శేఖర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణంలో చోరీ

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలో ఉన్న బస్టాండ్ సమీపంలోని ఓ దుకాణంలో చోరీ జరిగింది. దుకాణంలో రూ.15వేలకు పైగా సరుకును దొంగలించినట్లు బాధితుడు తెలిపారు. దుకాణంలో సరుకు విక్రయించేందుకు స్టాక్ పెట్టుకోగా ఆదివారం తెల్లవారుజామున దొంగలు సరుకును ఎత్తుకెళ్లారని వాపోయాడు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



ప్రవేశ పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు

సి.బెళగల్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బలరాముడు తెలిపారు. పాఠశాలలో ఉదయం ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు 922 మంది విద్యార్థులకు గాను 869 మంది హాజరయ్యారు. 53 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా మధ్యాహ్నం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశానికి 825 మందికి విద్యార్థులకు గాను 696 మంది హాజరు కాగా, 129 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సహాయకులతో సి.బెళగల్ బస్టాండ్, గురుకుల పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. జూపాడుబంగ్ల గురుకుల పాఠశాల తెలుగు అధ్యాపకుడు మున్నయ్య, సి.బెళగల్ ఎంఈఓ ఆదామ్‌బాషా పరిశీలకులుగా ఉన్నారు. కాగా స్థానిక ఎస్ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కల్లూరు : డాక్టర్ బీర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలలో ఐదవ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆదివారం పరీక్షలు నిర్వహించారు. చిన్నటేకూరులోని గురుకుల కళాశాలలో నిర్వహించిన పరీక్షలకు ఐదవ తరగతి ప్రవేశానికి మొత్తం 626 మంది విద్యార్థులు కేటాయించగా 506 మంది పరీక్షకు హాజరయ్యారు. 120 మంది గైర్హజరయ్యారు. అలాగే ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి 584 మంది విద్యార్థులను కేటాయింగా 507 మంది పరీక్షకు హాజరుకాగా 77 మంది విద్యార్థులు గైర్హజరైనట్లు అధికారులు తెలిపారు.

వక్ఫ్ సవరణ చట్టం అమలును నిలిపి వేయాలి

కర్నూలు(సెంట్రల్): ఇటీవల కేంద్రం తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టం అమలును వెంటనే నిలిపి వేయాలని ముస్లిం సంఘాల జేఏసీ నేతలు డిమాడ్ చేశారు. ఆదివారం పాతబస్తీలో ముస్లిం సంఘాల జేఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ముస్లిం పర్సనల్ లాబోర్డు జేఏసీ కన్వీనర్ జాకీర్ మౌలానా మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ చట్టంతో కలిగే అనర్థాలపై ప్రజలకు వివరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. ముస్లిం సమాజాన్ని మేల్కొల్పేందుకు మసీదుల్లో అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.అన్ని కులాలు, మతాలు, సంఘాలను కలుపుకొని ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలను చేపట్టనున్నట్లు చెప్పారు. 30వ తేదీ రాత్రి 9 గంటలకు ఇంట్లో కరెంట్ ఆఫ్ వేసి అర గంట పాటు నిరసన తెలియజేయనున్నట్లు చెప్పారు. వివిధ పార్టీల నాయకులు ఎంఏ హమీద్ అజీజ్ ఖాన్, ఎం.రాజశేఖర్, మునీర్ అహ్మద్, అబ్దుల్‌రహమాన్ తదితరులు పాల్గొన్నారు.